బిల్లులు అందక లబోదిబో

- పెండింగ్‌లో గోకులం షెడ్ల బిల్లులు
- ఆందోళనలో పాడి రైతులు



చిగిచెర్ల గ్రామంలో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డు

ధర్మవరం రూరల్: గోకులం షెడ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నా నేటికి బిల్లులు రాకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోకులం, మినీ గోకులం షెడ్ల నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు చేస్తూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. నాయకులు చెప్పారు కదా అని పాడి రైతులు అప్పులు చేసి గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేసుకున్నారు. గ్రామాల్లో చాలా మంది పాడి రైతులు షెడ్లను నిర్మించుకొని బిల్లుల కోసం కార్యాలయాలు, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆరు నెలలైనా...

గోకులం షెడ్లలో మూడు కేటగిరీలున్నాయి. రెండు పశువుల యూనిట్ ధర రూ.1,03,500కాగా ఇందులో రైతు వాటా కింద రూ.11,500 భరించాల్సి ఉంటుంది. ఇక నాలుగు పశువుల యూనిట్ ధర రూ.1,66,500 కాగా ఇందులో రైతు వాటా కింద రూ.18,500, ఇక ఆరు పశువుల యూనిట్ ధర రూ.2,07,000 కాగా రూ.23 వేలు రైతు భరించాల్సి ఉంటుంది. ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించి 293 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో అత్యధికంగా ముదిగుబ్బ మండలానికి 84 యూనిట్లు కేటాయించారు. కాగా వీటిలో 40 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా మరో 40 శాతం నిర్మాణ దశలో వున్నాయి. మరో 20 శాతం పునాదుల దశలో ఉన్నాయి. ఆరు నెలలు దాటినా బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో గోకులం, మినీ గోకులం షెడ్ల వివరాలు..

మండలం	మంజూరైనవి
ధర్మవరం	74
ముదిగుబ్బ	84
బత్తలపల్లి	60
తాడిమర్రి	75

బిల్లులు చెల్లించాలి



ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పాడి రైతులు అప్పులు చేసి మరీ గోకులం షెడ్లను నిర్మించుకున్నారు. అయితే ఆరు నెలలు కావస్తున్నా వారికి బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలి.

– మారుతి,
రైతు సంఘం నాయకులు, ధర్మవరం

త్వరలోనే బిల్లులు మంజూరు అవుతాయి



గోకులం షెడ్లు నిర్మించుకున్న రైతులకు త్వరలోనే ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుంది. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసుకున్న వాటి వివరాలను ఉపాధి అధికారులు బిల్లుల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. త్వరలోనే బిల్లులు వచ్చే అవకాశం ఉంది. పాడి రైతులు ఆందోళన చెందవద్దు.

సాయి మనోహర్, ఎంపీడీఓ ధర్మవరం

శుద్ధనీటి కేంద్రాలపై శ్రద్ధ ఏదీ?

- నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్లు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



చెరువువాండ్లపల్లిలో నిరుపయోగంగా ఉన్న శుద్ధ నీటి కేంద్రం



ఫిల్టర్లు, విద్యుత్ మీటర్లు అమర్చి వదిలేసిన దృశ్యం

నల్లమాడ: మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని చెరువువాండ్లపల్లి, సీ.కొత్తపల్లి గ్రామాల్లోని ప్రజలకు శుద్ధనీటిని అందించే ఉద్దేశంతో ఆయా గ్రామాల్లో ఏడేళ్ల క్రితం శుద్ధనీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ రెండు గ్రామాల్లో 260 కుటుంబాలు, వెయ్యి మందికిపైగా జనాభా ఉంది. గ్రామంలోని నీటి పథకం బోర్ల నుంచి శుద్ధి నీటి కేంద్రాల వరకు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ఫిల్టర్లు, విద్యుత్ కనెక్షన్‌కు అవసరమైన మీటర్లు అమర్చారు. కేవలం కాయిన్ బాక్స్‌లు అమర్చి శుద్ధ నీటి కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంది. కాయిన్ బాక్స్‌లో రెండు రూపాయల కాయిన్ వేసి ప్రజలు బిందె నీరు పట్టుకొని వెళ్లొచ్చు.

ఏడేళ్ల నుంచి నిరుపయోగం

2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రత్యేక షెల్టర్లు నిర్మించి శుద్ధి నీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం నీతి ఆయోగ్ కింద లక్షల రూపాయలు వ్యయం చేశారు. అవి ఏడేళ్ల నుంచి ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. సీ.కొత్తపల్లి శుద్ధ నీటి కేంద్రంలోని సంప్ మ్యాన్‌హోల్ నుంచి తమ అవసరాల కోసం గ్రామస్తులు బిందెలు, బక్కెట్లతో నీటిని తోడుకెళ్తున్నారు. ఈ క్రమంలో షెట్టర్ తెరచి ఉంచడంతో చిన్న పిల్లలు శుద్ధనీటి కేంద్రంలోకి వెళ్తే ప్రమాదం చోటుచేసుకొనే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

తాగునీరు కొనుక్కోవాల్సిందే

చెరువువాండ్లపల్లి, సీ.కొత్తపల్లి గ్రామాల్లో పంచాయితీ బోర్లు నుంచి నీరు సమృద్ధిగా సరఫరా అవుతోంది. ఆనీరు తాగేందుకు పనికిరాపోడంతో ఒక బిందెకు రూ.10 లు చొప్పున చెల్లించి ప్రైవేట్ ట్యాంకర్ల వద్ద ఫిల్టర్ నీరు కొనుక్కొని తాగుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. శుద్ధ నీటి కేంద్రాలు కళ్లెదురుగానే ఉన్నా అవి ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఫలితం లేకుండన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శుద్ధి నీటి కేంద్రాలను ప్రారంభించాలని చెరువువాండ్లపల్లి, సీ.కొత్తపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఏడేళ్లుగా శుద్ధనీటి కేంద్రాలు ప్రారంభానికి నోచుకోని విషయాన్ని నల్లమాడ పంచాయితీ కార్యదర్శి విశ్వనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమతిస్తే మేమే నిర్వహిస్తాం



శుద్ధనీటి కేంద్రాలు ఏర్పాటు చేసి ఏడేళ్లపైన అవుతోంది. ప్రారంభానికి నోచుకోక అవి నిరుపయోగంగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. అనుమతిస్తే అంతో ఇంతో ఖర్చయినా గ్రామస్తులమే భరించి వాటిని నిర్వహించుకుంటాం.

–అశోక్, సీ.కొత్తపల్లి

శుద్ధనీటి కేంద్రాలను ప్రారంభించాలి



చెరువువాండ్లపల్లి, సీ.కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన శుద్ధ నీటి కేంద్రాలను అధికారులు వెంటనే ప్రారంభించాలి. కాయిన్ బాక్స్‌లు ఏర్పాటు కనెక్షన్ ఇవ్వడం ఒక్కటే మిగిలివుంది. తక్కిన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. శుద్ధనీటి కేంద్రాలను ప్రారంభిస్తే రెండు గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుంది.

–మాధవరెడ్డి, సీ.కొత్తపల్లి

యోగా శిక్షణ



యోగాసనాలు వేస్తున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ తదితరులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొండ్రాల మూర్తి యోగాలో శిక్షణ ఇచ్చారు. సుమారు గంట పాటు యోగాసనాలు వేయించారు. అనంతరం యోగా ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ చెన్నకృష్ణతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కనగానపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి అసోసియేషన్ సభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చినట్లు యోగా గురువు సుబ్బరాయుడు తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి సాకే ఈశ్వరయ్య, సభ్యులు దివాకర్, గ్రంథాలయాధికారి గోవిందు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మంజునాథ్, స్థానిక సర్పంచ్ అంకె రామక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ కిశోర్

ధర్మవరం అర్బన్: ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ కిశోర్, జిల్లా సహాయ కార్యదర్శి శరత్ పేర్కొన్నారు. పట్టణంలోని శివానగర్‌లోనున్న భగవాన్ జీహ్వేశ్వర భజన మందిరంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభిక వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద, నేతాజీ, బాలగంగాధర్‌తిలక్, డాక్టర్ అబ్దుల్ కలాం తదితర మహనీయుల ఆశయాలను నిజం చేసేందుకు నేటి యువత వ్యక్తి గత జీవితానికి మానసిక, శారీరక శిక్షణ ఎంతో అవసరమన్నారు. ఈ శిక్షణలో వ్యాయామం, యోగాసనాలు, ఆటలు, కథలు తదితర వాటిని నేర్పించడంతోపాటు దేశభక్తిని పెంపొందించేందుకు జాతీయ భావాలున్న యోగ్యమైన వ్యక్తులను నిర్మాణానికి అఖిలభారత యువజన విభాగంలో మూడురోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతిఒక్కరూ దేశం నాకేమి ఇచ్చిందన్న ఆలోచన కాకుండా దేశానికి తాను ఏమి చేశాను అన్న సంకల్పంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భారతదేశ ప్రపంచంలో విశ్వ గురువుగా నిలవడానికి మనం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా సంఘ్ చాలక్ రామంజనేయులు, ఖండ కార్యవాహ్ నరసింహ, ఉపాధ్యాయ ప్రముఖ్ అన్నం అరవింద్, ఉమామహేష్, తిరుమలేసు తదితరులు పాల్గొన్నారు.


సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి టౌన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ శివనారాయణస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో క్షుద్ర పూజల కలకలం



షాను ఇంటిముందు క్షుద్రపూజలు చేసిన దృశ్యం

కదిరి టౌన్: గాంధీనగర్‌కు చెందిన ఓ మహిళ ఇంటి ముందు క్షుద్ర పూజలు కలకలం రేపాయి. వివరాలు.. గాంధీనగర్‌లో ఉన్న షాను ఇంటి ముందు ఎవరూ లేని సమయంలో రాత్రికి రాత్రే ఇంటి వాకిట్లో క్షుద్ర పూజలు నిర్వహించారు. నిమ్మకాయలు, చిన్న పాపను పడుకొబెట్టి నిమ్మకాయలు కుచ్చినట్లు, పసుపు, కుంకుమ, నల్ల కంబడి ఉంచి క్షుద్రపూజలు చేశారు. ఈవిషయాన్ని చుట్టుపక్కల వారు ఇంటి యజమానికి సమాచారం ఇవ్వడంతో ఆమె భయాందోళనకు గురయ్యారు. తనను, తన బిడ్డలను చంపడానికి ఎవరో ఇలా చేశారని ఆమె కన్నీరు మున్నీరయ్యారు.

క్రీడలతోనే ఉజ్వల భవిత



క్రీడాకారులకు మెమొంటో అందిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు

ధర్మవరం అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిత ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని కళాజ్యోతి ప్రెసిడెంట్ నారాయణప్ప, కార్యదర్శి రామకృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు సూచించారు. స్థానిక కళాజ్యోతిలో ఆదివారం సాయంత్రం వేసవి చెస్ శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులపాటు ఉచితంగా చదరంగం క్రీడలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చామన్నారు. చెస్ శిక్షకుడు శివకృష్ణ, ఆదిరత్నకుమార్, కిశోర్‌కుమార్ విద్యార్థులకు శిక్షణనిచ్చి వారిని క్రీడలో రాణించేలా తీర్చిదిద్దారని తెలిపారు. మొత్తం 200 మంది శిక్షణ తీసుకోగా 85 మంది క్రీడాకారులు చివరిరోజు టోర్నీలో పాల్గొని తమ సత్తా చాటి మెమొంటోలు అందుకున్నారన్నారు. కళాజ్యోతి ఉపాధ్యక్షుడు శింగనమల రామకృష్ణ, లయన్స్‌క్లబ్ కార్యదర్శి రమేష్‌బాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి



జొన్నలకొత్తపల్లి వద్ద బస్‌షెల్టర్ లేని దృశ్యం

ముదిగుబ్బ: మండలంలోని జొన్నలకొత్తపల్లి వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా రోడ్డు పక్కను చెట్లను సైతం తొలగించడంతో ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ బస్సు షెల్టర్‌నే ఏర్పాటు చేస్తే జొన్నలకొత్తపల్లి గ్రామంతో పాటు కమ్మవారిపల్లి గ్రామస్తులకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల వారు కోరుతున్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం



చెన్నేకొత్తపల్లిలో ప్రధాన రహదారి పక్కన వర్షపు నీరు నిలిచిన దృశ్యం

ఇటీవల కురిసిన వర్షాలకు చెన్నేకొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న మసీదుకు ఎదురుగా రోడ్డు పక్కన వర్షపు నీరు భారీగా నిలిచింది. నీటిలో చెత్తచెదారం, ఇతర వ్యర్థాలు కలవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి రోగాలు వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు. రహదారి పక్కనే ఉన్న నీరు నిల్వ ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడకముందే సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– చెన్నేకొత్తపల్లి:

క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



తాడిమర్రిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

తాడిమర్రి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వీరభద్రయ్యస్వామి ఆలయ ప్రహరీ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఆలయం ప్రాంగణంలో చెట్లు ఎక్కువ ఉండటంతో నీడ ఎక్కువగా ఉంటుంది. అంతేకాక ఆలయం ముందు, పడమటి వైపున ప్రహరీ ఉండటంతో నిత్యం పదుల సంఖ్యలు జనాలు అక్కడ కూర్చుంటూ ఉంటారు. తక్కువ ఎత్తులో ఉండటంతో అక్కడ ప్రహరీపై కూర్చునే వారికి ప్రమాదం జరిగి అవకాశం ఉంది. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం నిర్మించిన రాతి దిమ్మె ఓవైపున పగిలిపోయింది. దీంతో దిమ్మ విరిగి ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఏపీటీఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జగదీష్



పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీటీఎస్ఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పుట్టపర్తిలో సబ్ ట్రెజరీ ఆఫీసర్ జగదీష్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ ఏపీ ఎన్జీఓ హోంలో జరిగిన ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట ఉపాధ్యక్షుడిగా ఆయనకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు ట్రెజరీ ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామని జగదీష్ తెలిపారు.

మద్యం స్వాధీనం

నల్లచెరువు: మండలంలోని బందార్లపల్లిలో ఓ ఇంట్లో దాచి ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఇంట్లో అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వ చేశారనే సమాచారంతో ఆదివారం పోలీసులు సోదాలు చేశారు. ఈసందర్భంగా ఇంట్లో ఉన్న10 బాటిళ్లు(180 ఎంఎల్ బ్రాందీ) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మక్బూల్ బాషా తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

కదిరి టౌన్: అదనపు కట్నం కోసం తన భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని పట్టణంలోని అడపాలవీధిలో నివాసం ఉన్న ఇస్లావత్ సుశీల పట్టణ సీఐ వి.నారాయణరెడ్డికి ఆదివారం ఫిర్యాదు చేసింది. బుక్కపట్నం మండలం రాశింపల్లికి తండాకు చెందిన దామ్లానాయక్ కుమారుడు మల్లికార్జునతో తనకు పదేళ్ల క్రితం వివాహమైందని, కట్న కానుకల కింద 10 తులాలు బంగారు నగలు అందజేసినట్లు తెలిపింది. ఐదేళ్ల తర్వాత నుంచి అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేస్తూ.. కొట్టి హింసించేవాడని పేర్కొంది. పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి సర్దిచెప్పినా భర్త మల్లికార్జున ప్రవర్తనలో మార్పు రాలేదని వాపోయింది. తన భర్త వేధింపులు రోజురోజుకూ పెరిగిపోవడంతో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

త్రైత సిద్ధాంతం పై ప్రచారం



ప్రచారం చేస్తున్న దృశ్యం

తలుపుల: పెద్దన్నవారిపల్లి పంచాయతీలోని గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి(పులివెందుల) ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని మతాలు నిషిద్ధమని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సమితి అధ్యక్షుడు వరుణ్‌కుమార్, సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, పోతులూరు హరిశివ, నరసింహ, రామాంజి, కృష్ణవేణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

కొత్తచెరువు: ఇటీవల వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాజీ జెడ్పీటీసీ మహాలక్ష్మిని ఆదివారం ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు రెడ్డప్పరెడ్డి, మండల కన్వీనర్ శ్యామ్ సుందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాదయాత్ర వాల్మీకి శంకర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డె నారాయణ, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, డాక్టర్స్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, కొత్తచెరువు ఉపసర్పంచ్ యుగంధర్ రాయల్, ఆవుల అశోక్, మండల ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు, మాజీ వైస్ సర్పంచ్ డేరంగుల వెంకట రాముడు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సోదనపల్లి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మక్బూల్ అహ్మద్

నల్లచెరువు: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం నల్లచెరువు మండల కన్వీనర్ మొండెం రవికుమార్ ఆధ్వర్యంలో మండల నాయకులు కదిరి పార్టీ కార్యాలయంలో మక్బూల్ అహ్మద్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో పార్టీ స్థితిగతులపై కన్వీనర్‌తో చర్చించారు. కార్యక్రమంలో తనకల్లు మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, నాయకులు పోరెడ్డి వెంకటరెడ్డి,టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, హైటెక్ రమణ, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి, పల్లె వెంకటరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఖాదర్ బాషా, బయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కదిరి టౌన్: వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ జేఏసీ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులు, ముస్లిం మత పెద్దలు హాజరయ్యారు. జూలై 7వరకు జరగబోయే వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమంలో అందరూ వక్తలు కోరారు. అనంతరం వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో అతల్ అలాహీ నితిన్, టీఎండీ ఇలియాజ్, కెఎస్.హన్‌వాజ్, సలీమ్, మాసల్ నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి: ఉపాధి హామీ పథకంలో భాగంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మెట్ట భూముల్లో పండ్లతోటల పెంపకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లడారు. ఐదెకరాలలోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు, జాబ్ కార్డు ఉన్న వారు అర్హులన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, కొబ్బెర, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పామ్, ఆపిల్, మునగతోపాటు మల్లె, గులాబీ తోటల సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఉచితంగా మొక్కలు అందించడంతోపాటు మూడేళ్ల పాటు నిర్వహణకు డబ్బు కూడా చెల్లిస్తామని వివరించారు.

ధ్యానంతో ప్రశాంత జీవనం

బత్తలపల్లి: ధ్యాన సాధనతో ఏకాగ్రత, జ్ఞానం, ఆలోచనలు లేని ప్రశాంతమైన జీవితాన్ని పొందవచ్చని సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో హరిహర పిరమిడ్ ధ్యాన మందిరం నుంచి తరలివచ్చిన ధ్యానులు మహా కరుణ శాకాహార ర్యాలీని నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి జీవహింస మహా పాపమని ప్రతి మనిషి శాకాహారాన్ని భుజించాలని నినందించారు. కార్యక్రమంలో ధ్యాన మాస్టర్లు కొట్టాల ప్రభాకర్, రమాదేవి, వెంకటరెడ్డి, నాగేంద్రమ్మ, మదనాపు కొండన్న, నాగేంద్ర, నాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



బాధితుడు వంశీ

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని ఎర్రగుంటపల్లికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి తండ్రి భాస్కర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వంశీ డిగ్రీ వరకు చదువుకున్నాడు. జీవితంలో అనుకున్నది ఏదీ సాధించలేనని మానసిక వేదనకు గురయ్యేవాడు. డాక్టర్ వద్ద చికిత్స చేయించినా మానసికంగా ఇబ్బందులు పడేవాడు. ఒక్కోసారి ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయేవాడు. తర్వాత ఇంటికి వచ్చినా ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో బ్లేడ్‌తో చేయి కోసుకోవడంతోపాటు ఫ్యాన్ ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.